క్లుప్తంగా

మోడల్ స్కూల్లో పోషణ మహోత్సవం



విద్యార్థులు తెచ్చిన వంటలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్లో మంగళవారం పోషణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తరగతుల వారీగా వంటలను తయారు చేసుకొని వచ్చి 14 స్టాళ్లను ఏర్పాటు చేశారు. తోటి విద్యార్థులకు ఆ వంటకాలను రూ.10, రూ.20 చొప్పున విక్రయించారు. అందులో ఎలాంటి విటమిన్స్, మినరల్స్ ఉన్నాయో చార్ట్ తయారు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ.. పెరిగే పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు తామే స్వయంగా వంట చేసి అందులో ఏఏ పోషకాలు ఉన్నాయో తెలుసుకోవడం ద్వారా ప్రయోజనంతో పాటు మార్కెటింగ్ ఏలా చేయొచ్చో నేర్చుకునే అవకాశం ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉంటుందన్నారు. కాగా కార్యక్రమాన్ని సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చేపట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు: కందుకూరు పీహెచ్‌సీలో మంగళవారం సమాజ్‌వాది పార్టీ మండల అధ్యక్షుడు పి.రమేశ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ తరఫున సేవా కార్యక్రమాలు విరివిగా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యాదగిరి, మహేందర్, కృష్ణ, మహేందర్‌గౌడ్, అంజయ్య పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మరు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు కలిసి నాటకం మొదలుపెట్టాయిని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ పరిపాలన చేస్తున్న ఏ రాష్ట్రంలోనైన రైతులకు రుణమాఫీ చేసిందా అని ఆయన ప్రశ్నించారు?. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో చేస్తున్న హైడ్రామాను రాష్ట్ర ప్రజలు ఎవరు నమ్మలేరన్నారు. ఇప్పటికైనా వారి వైఖరిలో మార్పు తెచ్చుకోవాలన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

మహేశ్వరం: యూత్ సర్వీస్, స్పోర్ట్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన యూత్ ఫెస్టివల్ అండ్ సైన్స్ మేళాలో పెండ్యాల స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మండల పరిధిలోని పెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు ఎ.శ్రావణి, జే.శ్రీవాణి, ఐ.దీక్షిత, సి.గౌతమి, బి.దీపికా పోటీల్లో పాల్గొని ఫోక్ డ్యాన్స్(జానపద నృత్యం) పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాలకుమార్ విద్యార్థులను అభినందించారు.

వీధి లైట్ల మంజూరు



వీధి లైట్లను చూపిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌నాయక్ తదితరులు

యాచారం: భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంతన్‌గౌరెల్లి గ్రామానికి మంగళవారం 27 వీధి లైట్లు మంజూరు చేయించారు. ఈ వీధి లైట్లను గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్ర అరవింద్‌నాయక్ పర్యవేక్షణలో గ్రామంలోని స్తంభాలకు బిగించారు.

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు

- ప్రశాంతతకు నిలయంగా మామిడిపల్లి బాలాజీ ఆలయం
- 3 నుంచి 8వ తేదీవరకు ఉత్సవాల నిర్వహణ
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



మామిడిపల్లి శివారులోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం

పహాడీషరీఫ్: చుట్టూ పంట పొలాలు.. కొండలు, కోనేరుల నడుమ ప్రశాంత వాతావరణంలో మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి కొలువుదీరారు. కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నారు. మామిడిపల్లికి కిలోమీటర్ దూరంలో ప్రాచీన కట్టడంగా ఉన్న ఈ ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. జిల్లాలోని మహేశ్వరం శివగంగరాజరాజేశ్వర దేవాలయం, అమ్మపల్లి, మామిడిపల్లి ఆలయాలు ఒకేసారి కట్టినట్లు ప్రాచుర్యంలో ఉంది. అక్కనమాదన్నల హయాంలో నిర్మించిన ఈ ఆలయం నిజాం నవాబుల కాలంలో ప్రధానిగా ఉన్న మహారాజా కిషన్ పరిషాద్ పర్యవేక్షణలో కొనసాగేదని భక్తులు చెబుతున్నారు.

వందల ఏళ్ల చరిత్ర ఆలయ సొంతం..

పూర్వం వెయ్యేళ్ల క్రితం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మామిడిపల్లి శివారులోని భారీ కొండపై స్వయం వ్యక్త మూర్తిగా వెలిశారు. కాలక్రమేణా కొండపై పూజా కైంకర్యాలు చేసేందుకు వీలులేకుండా దట్టమైన అడవి ఉండడం. అక్కడ ఆలయ నిర్మాణం కూడా ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని పాలించే రాజుకు స్వప్నంలో కొండకు ఎదురుగా ఆలయ నిర్మాణం చేపట్టాలని స్వామివారు సాక్షాత్కరించారని ఇందులో భాగంగానే కొండకు ఎదురుగా ఈ ఆలయాన్ని నిర్మించారని పూర్వకాలం నుంచి ప్రచారం ఉంది. ఇప్పటికీ ఆ కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఈ కొండను కూడా దేవుడిగుట్ట అని భక్తులు పిలుస్తుంటారు.

దాతల సహకారంతో దినదినాభివృద్ధి

2020 లాక్‌డౌన్ నుంచి దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో చక్కటి పార్కు ఏర్పాటు, స్వాగత కమాన్, కోనేరుపై కాలేయ మర్దిని విగ్రహం, గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం, ఆలయ ప్రాకారంపై దశావతరాల నిర్మాణం, గర్భగుడిపై ప్రాకారం నిర్మించి ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ఈ అదనపు సొబగులతో ప్రస్తుతం ఆలయానికి కూడా భక్తుల తాకిడి పెరిగి, దేవాదాయ శాఖకు ఆదాయం కూడా భారీగా సమకూరుతోంది. ఇక్కడ సీరియల్ షూటింగ్‌లు, ప్రత్యేక పాటల షూట్‌లు కూడా నిత్యం జరుగుతున్నాయి.

ఈ నెల 3 నుంచి నుంచి ఉత్సవాలు..

అక్టోబర్ 3వ తేదీ గురువారం విష్వక్సేనారాధన, అంకురార్పణ, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలతో ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 4వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు బాలభోగం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ హవనం, ధ్వజారోహనం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, హవనం, దేవతాహ్వానం ఉంటుంది. 5వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు బాలభోగం, శాంతిపాఠం, 11 గంటలకు తిరుక్కల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, శేష వాహన నివేదన కార్యక్రమాలు కొనసాగుతాయి. 6వ తేదీ ఆదివారం గరుడ వాహన సేవ, 7వ తేదీ సోమవారం హనుమంత సేవ, 8వ తేదీ మంగళవారం జరిగే చక్రతీర్థం, ధ్వజావరోహణంతో ఈ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ఈఓ మురళీకృష్ణ తెలిపారు.

నాటి శిల్ప కళా వైభవానికి నిదర్శనం



పూర్తిగా నిండిన కోనేరు గట్టున ఏర్పాటు చేసిన విగ్రహం

శ్రీ బాలాజీ వేంకశ్వరస్వామి ఆలయం నాటి శిల్ప కళా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పూర్తి రాతి కట్టడంతో కట్టిన ఈ ఆలయ నిర్మాణం భక్తులను ఇట్టే కట్టి పడేస్తుంది. ఆలయానికి మొదటిసారి వచ్చిన భక్తులు ఒకటికి రెండుసార్లు ఆలయ నిర్మాణాన్ని తనివి తీరా చూడక తప్పదు. ఆలయ గర్భగుడిలో నల్లరాతి విగ్రహంతో ఉన్న స్వామివారికి కుడి వైపున శ్రీదేవి, ఎడమ వైపున భూదేవిలు కొలువుదీరారు. గర్భగుడి ప్రధాన ద్వారానికి ఇరు వైపులా జయ, విజయంలు కొలువుదీరారు. స్వామివారి దేవాలయ మండపాన్ని మొత్తం 30 రాతి స్తంభాలతో నిర్మించారు. ఈ స్తంభాలు సైతం పద్మములతో లిఖించబడి ఉన్నాయి. స్వామివారి గర్భగుడి గోపురంపై విశేషమైన దేవతామూర్తులు, దశావతారాలు చెక్కబడ్డాయి. ముఖ్యంగా దేవాలయ మండపం ఎదుట రాతితో శ్రీకూర్మం (తాబేలు) ముద్రించారు. ఇలాంటి శ్రీకూర్మం ప్రాచీనమైన ఆలయాలకే ప్రత్యేకంగా ఉంటుంది. దీంతో పాటు స్వామివారి గర్భగుడికి ఎదురుగా గరుడ అల్వార్, ధ్వజ స్తంభాలున్నాయి. ఉత్సవాల సమయంలో స్వామివారిని శేష, గరుడ, హనుమత్ వాహనాలపై ఊరేగించడం ఇక్కడ విశేషం. స్వామివారి గర్భగుడి గోపురం మాదిరిగానే సింహద్వారం కూడా అలాగే నిర్మించారు. ఆలయం బయట ఉన్న కోనేరు కూడా పూర్తి రాతి కట్టడంతో నిర్మించారు. అన్ని కాలాల్లో కూడా ఇందులో నీరు సమృద్ధిగా ఉండడం ఈ కోనేరు ప్రత్యేకత.

ఎంపీ కొండాను కలిసిన గంగపుత్రులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన గంగపుత్రులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు రావిర్యాల చెరువుపై 150 కుటుంబాలు ఆధారపడి జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఈ చెరువులో చేపలను పట్టడానికి తాము ప్రస్తుతం పాత పుట్టీలను వాడుతున్నామని తెలిపారు. ఇందుకుగాను ఆధునిక ఫైబర్ బోట్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై ఎంపీ స్పందించి రెండు ఫైబర్ బోట్లను అందజేస్తామన్నారు. ఎంపీకి గంగపుత్ర సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తుక్కుగూడ పురపాలక సంఘం చైర్‌పర్సన్‌గా ఇటీవల ప్రమాణం స్వీకారం చేసిన బరిగేల హేమలతరాజుగౌడ్ దంపతులు ఎంపీని కలిసిన పుష్పగుచ్ఛం అందజేశారు. వారికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షుడు బరిగేల రాకేశ్, నాయకులు తలారి శ్రీనివాస్, అంబోజీ శ్రీనివాస్, శివరాజ్, నవీన్, శ్రీశైలం, పాశం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చైర్‌పర్సన్ హేమలత



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగేల హేమలతరాజుగౌడ్ సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బి.వెంకట్రామ్, మాజీ చైర్మన్ కే.మధు మోహన్, కౌన్సిలర్లు జపాల భావన, సప్పిడి లావణ్య, మేనేజర్ టీ.పర్వతాలు, సినియర్ అసిస్టెంట్ వెంకటేశ్, జంగయ్య, మల్లేశ్, పాఠశాల, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారి వేషధారణలో చిన్నారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలు, కాలనీలు, డివిజన్‌లలో దుర్గామాత అమ్మవారి నవరాత్రికి ఏర్పాట్లు మొదలయ్యాయి. మంగళవారం బడంగ్‌పేటలోని లార్డ్స్ పాఠశాలలో దుర్గామాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవార్ల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలలో దుర్గామాతను నెలకొల్పి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజిస్తామని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీన్ సతీశ్, ప్రిన్సిపాల్స్ రామిడి సంతోష్, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి రేఖాసాగర్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మతల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, మురళీ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్త..!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తొర్రూర్ రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తాచెదారం

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి, ఆయా మండల పరిధిలో స్వచ్ఛతా హీ సేవ పేరిట అనేక కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నప్పటికీ పరిసరాల శుభ్రత విషయంలో ఇటు అధికారులు, అటు స్థానికులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ కాలనీలో చూసినా చెత్త పేరుకుపోతుంది. అక్కడ శుభ్రం చేసేవారు కరువవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు లేరని చెబుతున్నారు. దీంతో తాము విషజ్వరాల బారిన పగుతున్నామని చెబుతున్నారు. చెత్త తొలగింపజేసే విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు, ఇంజాపూర్ నుంచి సాహెబ్ నగర్‌కు వెళ్లే రోడ్డు మార్గాల్లో డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్త పేరుకుపోతుందని ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇళ్లలో వెలువడే చెత్తను నేరుగా స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలని అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నా కొంతమంది స్థానికుల్లో మార్పు కనిపించడం లేదు. ఎక్కడ ఖాళీ స్థలం కనపడితే అక్కడే చెత్త వేస్తూ పరిసరాల అపరిశుభ్రతకు కారణమవుతున్నారు. ఇలా బాధ్యత లేకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో గల క్రికెట్ మైదానంలో మంగళవారం ఎంబిఏ ఛాంపియన్ ట్రోఫీ సీజన్-4 ఆర్గనైజర్ తాహెర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎల్మేటి అమరేందర్‌రెడ్డి ముఖ్యులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువతకు క్రీడలు అవసరమన్నారు. యువకులు చెడు అలవాట్లకు బానస కాకుండా క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. విచ్చేసిన టీమ్‌లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వంగేటి మధుసూదన్‌రెడ్డి, అచన శ్రీనివాస్, సర్వర్ అలీ, నవాబ్‌ఖాన్, అబ్దుల్ కలీం, ఆసిఫ్, జిలాని, సలీం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మేయర్ పారిజాత, విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జ్ఞానజ్యోతి విజ్ఞాన్ స్కూల్‌లో మంగళవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్ పాల్గొని విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అన్నారు. భారీ బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ విద్యార్థులు బతుకమ్మ ఆటలు ఆడారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా



పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్‌తో పాటు టై, బెల్టులు అందజేస్తున్న భాస్కర్ రెడ్డి తదితరులు

మంచాల: లింగంపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని దాత అనిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మంచాల మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు టై, బెల్టులు, గుర్తింపు కార్డులు, పాఠశాలకు ఎలక్ట్రానిక్ బెల్ అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తను ఇదే పాఠశాలలో చదువుకున్నారన్నారు. తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తారిరాజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, అర్చన, సురేందర్‌రెడ్డి, రాజేందర్, జగన్నాథ్, అపర్ణ, బాలరాజు, యాదయ్య, శిరీష, స్థానిక పెద్దలు ఐలేశ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూల పండుగకు వేళాయె

- నేటి నుంచి బతుకమ్మ సంబురాలు
- ఆటపాటలకు సిద్ధమైన మహిళలు
- ఎంగిలిపూలతో మొదలై సద్దులతో ముగింపు



షాబాద్‌లో మహిళలు పేర్చిన బతుకమ్మలు

షాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ. ఈ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం తేడా లేకుండా పూల పరిమళాలు వెదజల్లుతాయి. గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గోరింట ఇలా తీరొక్క పువ్వు బతుకమ్మను ఆహ్వానిస్తుంది. తెలంగాణ ప్రజలు ఎంతో ఆడంబరంగా జరుపుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఎంగిలిపూలు మొదలు సద్దులవరకు ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు బతుకమ్మను ఆటపాటలతో కొలుస్తారు. పంటలు, ప్రజలు, గొడ్డుగోదా బాగుండాలని కోరుకుంటారు.

ఇదీ పండుగ చరిత్ర..

పూర్వం ధర్మాంగుడు అనే రాజు ఉండేవాడని, అతని భార్య సత్యవతికి వంద మంది కొడుకులు పుట్టినవారు పుట్టినట్లే చనిపోయారు. దంపతులిద్దరూ లక్ష్మీదేవి పూజ నిర్వహిస్తారు. వారికి చివరకు ఒక ఆడపిల్ల పుట్టింది. ఆమెను బతికించుకోవడానికి లోకమాత అయిన దుర్గాదేవికి శరన్నవరాత్రుల పేరిట పూజలు నిర్వహిస్తారు. అప్పటివరకు ఆమెకు పేరు పెట్టకుండా ఉండి ఆ బిడ్డ బతకాలని అందరూ ఆమె పేరు బతుకమ్మ అని పెట్టారు. అప్పటి నుంచి క్రమంగా ఆ పాప పేరు బతుకమ్మగా మారింది. అప్పటి నుంచి లక్ష్మీదేవిగా నామకరణం చేసిన అందరూ బతుకమ్మగానే పిలుస్తారు. ఆ మహారాజు కూతురు ఎక్కడికి వెళ్లినా.. ఎవరింట్లో అడుగు పెట్టినా లక్ష్మీ దేవి తండావిస్తోంది. అప్పటి నుంచి బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని పూర్వీకులు వివరించారు.

ఒక్కో రోజు ఒక్కో పేరుతో..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి, మరునాడు అలంకరణకు వాడటంతో ఇలా పిలుస్తారు. రెండోరోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, అయిదో రోజు అట్ల, ఆరో రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి బతుకమ్మ ఆడరు. ఏడోరోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ. చివరిరోజు ఆడబిడ్డలు ఆడిపాడి, పోయిరా బతుకమ్మ.. మళ్లొచ్చే ఏడాది తిరిగి రావమ్మా.. అని వీడ్కోలు పలుకుతారు. నిమజ్జనం చేశాక వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు.

ఆడబిడ్డల పండుగ

బతుకమ్మ పూల పండుగ. ఆడబిడ్డలతో ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజొక్క పేరుతో బతుకమ్మ ఆడుతాం. ఎక్కడ ఉన్నా పండుగకి సొంత ఊరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకృతిని, దేవుడిని పూజించడంతో పాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండడం మా అదృష్టం.

– జడల లక్ష్మి, షాబాద్

ఇంటి దేవతగా కొలుస్తాం

తెలంగాణ పండుగ బతుకమ్మ. బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవతగా కొలుస్తాం. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను అలంకరించి అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటాపోటీగా బతుకమ్మను పేరుస్తాం. ఈ పండుగ మనకు నైతిక విలువలను కూడా అలవాటు చేస్తుంది.

– అరుణ, బోడంపహాడ్, షాబాద్

పువ్వులను కీర్తిస్తూ..

బతుకమ్మ పాటల్లో కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి ఉంటుంది. రకరకాల పువ్వులు రంగు రంగులలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు, తంగేడు పూలు ఎక్కువగా పూస్తాయి. బంతి, చామంతి, పూలకు కూడా ఇదే సమయం, ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ తెలంగాణలో సౌందర్యం, ఆత్మగౌరవం పెంపొందిస్తుంది.

– జ్యోతి, కక్కులూర్, షాబాద్